


## నేడే జగనన్న విద్యాదీవెన

**జిల్లాలో 32,427 మంది విద్యార్థులకు లబ్ధి**
**తల్లుల ఖాతాల్లో రూ.20,54,29,471లు జమ**

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**
పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకం మార్చి 1వ తేదీన ప్రారంభించనున్నారని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు మండలం నుంచి ప్రారంభిస్తారన్నారని, జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ విద్యాసంవత్సరం మొదటి విడతలో జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోని 32,427 మంది విద్యార్థులకు గాను 29,407 మంది తల్లుల ఖాతాల్లో రూ.20,54,29,471 నిధులను డీబీటీ విధానంలో జమచేయనుందన్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 20వ తేదీ వరకు పరీక్షలు
- హాజరు కానున్న 32,757 మంది విద్యార్థులు
- 50 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- జిల్లా వృత్తి విద్యాధికారి సయ్యద్ మౌలా



పుంగనూరులో పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్**
ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని మొత్తం 136 కళాశాలలకు చెందిన 32,757 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మార్చి 1వ తేదీన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండో తేదీన ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమవుతాయి. చివరి పరీక్ష మార్చి 20వ తేదీన ముగుస్తుంది. నిర్ధారిత తేదీల్లో ప్రతిరోజు ఉదయం9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఒక్కో పరీక్ష కేంద్రంలో సరాసరిన 420 మంది విద్యార్థులకు సరిపడా 12 గదులను ఏర్పాటు చేశారు. ప్రతి గదిలో 32మంది విద్యార్థులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 19 హైస్కూల్ ప్లస్, 6 ఏపీ మోడల్ పాఠశాలలు, 8 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, 4 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలు, ఒక బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాలతో పాటు 67 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో జనరల్ కోర్సుకు సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 13,797 మంది, ద్వితీయ సంవత్సరంలో 14,428 మంది విద్యార్థులతో కలిపి మొత్తం 28,225 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుకు సంబంధించి మొదటి సంవత్సరంలో 2,108 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,424 మందితో కలిపి మొత్తం 4,532 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పరీక్షలకు ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా 600మంది ఇన్విజిలేటర్ల నియామకం పూర్తిచేశారు. అదేవిధంగా ఇది వరకే గుర్తించిన పలు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో 500 సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసి, వాటి ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నుంచి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు.

### అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

**జిల్లా వృత్తి విద్యాధికారి సయ్యద్ మౌలా**



జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి మార్చి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా వృత్తి విద్యాధికారి సయ్యద్ మౌలా తెలిపారు. ఈమేరకు ఆయన గురువారం తన కార్యాలయంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పరిశీలకులు దుర్గాప్రసాదరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 28,225 మంది జనరల్, 4,532మంది ఒకేషనల్ విద్యార్థులకు ఇదివరకే హాల్ టికెట్ల పంపిణీ పూర్తి చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, అసౌకర్యానికి గురికాకుండా ఉండేలా ఏర్పాట్లు చేశాం. ముఖ్యంగా ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది, మంచి నీటిఏర్పాటు, పరీక్ష గదిలో మంచి గాలి, వెలుతురు సోకే విధంగా చర్యలు తీసుకున్నాము. జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షల్లో కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాము. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నుంచి తనతో పాటు సంబంధిత అధికారులు పరీక్ష ముగిసేంత వరకు మూడు గంటలపాటు నిరంతరాయంగా పర్యవేక్షిస్తాం. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలను రాయడంతో పాటు, మంచి మార్కులు సాధించి ఈ ఏడాది చిత్తూరు జిల్లాకు ఉన్నత స్థానాన్ని, పేరు ప్రఖ్యాతలు తేవాలని జిల్లా వృత్తి విద్యాధికారి సయ్యద్ మౌలా కోరారు.

### ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**పుంగనూరు:** ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కస్టోడియన్ రెడ్డప్ప చెప్పారు. మార్చి 1వ తేదీ నుండి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు కస్టోడియన్ గురువారం చెప్పారు. ఈసందర్భంగా పట్టణంలో బసవరాజ బాలురు జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎంసివి జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి తరగతి గదికి సీసీ కెమెరాలు నిఘాలు పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 989, రెండవ సంవత్సరం విద్యార్థులు 702మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

**సోమల:** మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1వ తేదీ నుండి జరగనున్న ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించాలని ఎస్సై వెంకట నరసింహులు కోరారు. గురువారం కళాశాలలో విద్యార్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

## పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ : కలెక్టర్



మార్చి1 నుండి ఇంటర్ పరీక్షలు నిర్వహించుటకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడమైనది జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1న ప్రారంభమై 4, 6, 9, 12, 14, 16, 19 తేదీలలో జరగనుండగా, రెండవ సంవత్సరం పరీక్షలు మార్చి 2న ప్రారంభమై 5, 7, 11, 13, 15, 18, 20 తేదీలలో జరుగనుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్షా కేంద్రాలలో 28,225 మంది జనరల్ మరియు 4,532 మంది ఒకేషనల్‌కు సంబంధించి మొత్తం 32,757 మంది పరీక్షలు వ్రాయనుండగా ఇందులో మొదటి సంవత్సరం పరీక్షలకు 15,905 మంది, రెండవ సంవత్సరం పరీక్షలకు 16,852 మంది హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు ఉదయం 8.30 గంటల నుండి పరీక్షా హాల్‌లోకి అనుమతించబడతారని ఉదయం 9 గంటలు తరువాత క్షణం ఆలస్యమైనా విద్యార్థులు పరీక్షా హాల్‌లోకి అనుమతించబడరని తెలిపారు.

పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలో 144సెక్షన్‌ను అమలుపరచాలని, జిరాక్స్ షాప్‌లను మూసివేయించాలని రెవెన్యూ అధికారులను, పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ బందోబస్తుతో ప్రశ్నాపత్రాల తరలింపు జరగాలన్నారు. ఇన్విజిలేటర్లతో సహావిద్యార్థులు ఎవరూ ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షాహాల్‌కు తీసుకువెళ్లకూడదని అన్నారు. విద్యార్థులు పరీక్షాకేంద్రాల వద్దకు చేరేందుకు ఆర్టీసీ వారు విస్తృత ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశించడం జరిగిందన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పరీక్షా కేంద్రాల వద్ద వైద్యఆరోగ్య శాఖ వారు తగిన జాగ్రత్తలు వహిస్తూ తగిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ వారు నిరంతర విద్యుత్తు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతోపాటు పరీక్షా పత్రాలను ఇతర ప్రాంతాలకు చేరవేసేందుకు పోస్టల్ డిపార్ట్మెంట్ వారు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు.

## సహాయ కమిషనర్ గోవర్ధన్ సేవలు మరువలేనివి

**ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం**



**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ పి.గోవర్ధన్ సేవలు మరువలేనివని మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ కొనియాడారు. సహాయ కమిషనర్ గోవర్ధన్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం గురువారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... పురపాలకశాఖ పరిధిలో 38 సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వహించడం సామాన్య విషయం కాదన్నారు. శేషజీవితం సాఫీగా సాగిపోవాలని ఆకాంక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ చిత్తూరు నగరపాలక సంస్థలో సహాయ కమిషనర్‌గా గోవర్ధన్ గొప్ప సేవలు అందించారని కొనియాడారు. హెల్త్ అసిస్టెంట్‌గా, సానిటరీ ఇన్స్పెక్టర్ గా, సూపర్వైజర్ గా, పురపాలక కమిషనర్ గా, ప్రస్తుతం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ గా విధులు నిర్వహించి, అత్యుత్తమ సేవలు అందించాలని కొనియాడారు. సహాయ కమిషనర్ పి.గోవర్ధన్ సేవలను డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, ఇతర శాఖల అధికారులు, తిరుపతి కార్పొరేషన్ అధికారులు ప్రశంసించారు. ఈసందర్భంగా నగరపాలక సంస్థ తరపున మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు సహాయ కమిషనర్ గోవర్ధన్ దంపతులను గజమాల, శాలువతో సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చెందిన నగరపాలక డ్రైవర్ నటరాజన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఆర్ఓ గోపాలకృష్ణ వర్మ, ఎంఈ గోమతి, ఏసిపీ రామకృష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అధికారులను సన్మానించిన జెసి



**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** రెవెన్యూ శాఖలో 42 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేసి కలెక్టరేట్ ఎల్ఎ విభాగం పర్యవేక్షకులుగా ఉండి పదవీ విరమణ పొందుతున్న పి. వెంకట్రాయులు, 40 సంవత్సరాలు పనిచేసి ఎన్నికల విభాగం పర్యవేక్షకులుగా ఉండి పదవీ విరమణ పొందుతున్న ఎ.ప్రసాద్ బాబు, రెవెన్యూ శాఖకు విశేషసేవలు అందించారని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు కొనియాడారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఏపి రెవెన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎల్ఎ విభాగం పర్యవేక్షకులు పి.వెంకట్రాయులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎ.ప్రసాద్‌బాబు పదవీ విరమణ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో క్రమశిక్షణ, అంకిత భావంతో విధులు నిర్వర్తించిన వీరి జీవితం పదవీ విరమణ అనంతరం సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. డిఆర్ఓ బి.పుల్లయ్య మాట్లాడుతూ రెవెన్యూశాఖలో వీరు ఇద్దరూ విధులు నిర్వర్తించడంలో ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. డ్వామా పిడి ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ కరోనా సమయంలో పుంగనూరు తహశీల్దార్‌గా పనిచేసిన పి.వెంకట్రాయులు అధికారుల ఆదేశాలను తప్పక పాటించారని, కరోనా బాధితులకు సహాయం అందించారని వీరి సేవలను అభినందించారు
సన్మాన గ్రహీతలు పి.వెంకట్రాయులు, ఎ.ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పని చేయడంలో అధికారులు అందించిన సహకారం మరవలేదనాన్నరు. అనంతరం సన్మాన కార్యక్రమం జరిగింది. డిజాస్టర్ మేనేజ్మెంట్ డిప్యూటీ కలెక్టర్ శివయ్య, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల పర్యవేక్షకులు, ఏపి రెవెన్యూ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ హుసేన్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే.ఇబ్రహీం, కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ పార్థసారధి, సెక్రెటరీ రాజు, ట్రెజరర్ మధు బాబు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 3న పోలియో చుక్కలు

**పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించండి: కలెక్టర్**

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** మార్చి 3వ తేదీ 0-5 సంవత్సరం లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో మార్చి 3వ తేదీన జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమంకు సంబంధించి బ్యానర్‌లు, పోస్టర్స్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ 0-5 సంవత్సరం లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని, పోలియో చుక్కలు వేయించుకొనేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు 4,5 తేదీలలో ఇంటింటికీ వెళ్లి వేయడం జరుగుతుందని అన్నారు. ఇప్పుడే పుట్టినబిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపల పిల్లలకు విధిగా అదనంగా ఈ పోలియోచుక్కలు వేయించాలని, తద్వారా పోలియో లేని సమాజ స్థాపనే లక్ష్యమన్నారు. జిల్లా మొత్తం మీద 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ కేంద్రాల పరిధిలో 8మంది ప్రోగ్రాం అధికారుల ద్వారా 142 రూట్లలో 1,415 కేంద్రాల ద్వారా 20,9971 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఇందులో 149 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, వీటిని మొబైల్ బూత్‌ల ద్వారా కవర్ చేయడం జరుగుతుందని తెలిపారు. వీటిని అన్నింటిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా నోడల్ అధికారి మరియు వ్యాధినిరోధక టీకాల అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డిపిఎంఓ డాక్టర్ హర్షవర్ధన్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, మున్సిపల్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, ఎన్‌సిడి కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, డెమో జయ రాముడు, ఏపీ డిమియాలజిస్ట్ శ్రీవాణి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

**సోమల:** మార్చి 3వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని డిటి రామమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కందూరు వైద్యాధికారిని విజయలక్ష్మి, పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారి బాలాజీ, ఎంఈఓ శివరత్నమ్మ, వైద్య సిబ్బంది కలసి పల్స్ పోలియో విజయవంతానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న విషయాలపై సమీక్ష నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయించేందుకు క్షేత్రస్థాయి వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించి విజయవంతం చేయాలని నిర్ణయించారు.





పల్స్ పోలియో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్

**బంగారుపాళ్యం:** 3న పల్స్ పోలియో కార్యక్రమం జయప్రదం చేయాలని ఎంపీడీవో శివశంకర్ కోరారు. గురువారం మండల కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వైద్యులు లోహిత్ చంగల్ రాయులు, రమేష్ పాల్గొన్నారు.

**చిత్తూరు డెస్క్:** 3వ తేదీన నిర్వహించ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సింగయ్య కోరారు. గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బందికి పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, సూపర్వైజర్ అనసూయమ్మ, లక్ష్మీపతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టూరిజం కారిడార్‌గా 'రాణిమహల్'

**డిప్యూటీ సీఎం నారాయణస్వామి**



రాణీ మహల్ ఆధునీకరణకు జీవోను చూపుతున్న డిప్యూటి సీఎం

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన చారిత్రక కట్టడాలను పూర్వ వైభవం తీసుకొచ్చి కార్వేటినగరాన్ని టూరిజం కారిడార్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గత తొమ్మిది వందల సంవత్సరాల క్రితం కార్వేటినగరం సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన భవనాలకు గొప్పచరిత్ర ఉందన్నారు. అయితే గతంలో ఏ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుందని, వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక స్థానిక ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ శిధిలావస్థకు చేరుకున్న రాణిమహల్‌కు పూర్వవైభవం తీసుకురావాలని, కార్వేటినగరం చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పాలని పట్టుపట్టడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి ఆర్కాలజిస్టు వారికి స్వాధీనం చేయడంతో పాటు అభివృద్ధికి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన ఈ భవనాన్ని ఆనాటి రాజులు ప్రభుత్వానికి స్వాధీనం చేయడంతో సుమారు 75 సంవత్సరాల పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలుగా వినియోగించుకున్నారని తెలిపారు. అదే సంస్థానాధీశులు నిర్మాణం చేపట్టిన వేణుగోపాలస్వామి ఆలయం, స్కంధపుష్కరిణితో పాటు నియోజకవర్గంలోని ఆళత్తూరులో వెలసి ఉన్న పరద వెంకటేశ్వస్వామి కొటార్వేడు గ్రామంలో వెలసి ఉన్న అగస్థీశ్వరస్వామి ఆలయం, పెనుమూరులో కనిగిరి వెంకటేశ్వరస్వామి ఆలయం, పాలసముద్రం మండలంలో మఠవలంలో వెలసి ఉన్న గోవర్ధనేశ్వరస్వామి ఆలయాలను టూరిజంలో ఆలయాల దర్శనార్థం బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీంతో గ్రామం అభివృద్దే కాకుండా రాజుల ఆకాంక్షను నెరవేర్చినట్లు అవుతుందన్నారు. రాణీమహల్‌ను ఆధునీకరణకు సహకరించిన మంత్రులు కన్నబాబు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథిన్ రెడ్డి, ఆర్కేరోజా, రాష్ట్ర విద్యా కార్యాదర్శి ప్రవీణ్ ప్రకాష్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### త్వరిత గతిని పనులు పూర్తి చేస్తాం

**టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్**

సీఎం జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో చేపట్టనున్న రాజీ మహల్ ఆధునీకరణ పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేస్తానని టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ అన్నారు. రాణిమహల్ పూర్తిస్థాయిలో పరిశీలించి ఆధునీకరణకు ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందని, మార్చి మొదటి వారంలో భవనం ఆధునీకరణకు భూమిపూజ చేబట్టడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణం అనంతరం రాణీమహల్‌ను మ్యూజియంగా మార్చి నగరాన్ని ఒక పర్యాటక కేంద్రంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో భాగంగా కార్వేటినగరం చారిత్రక కట్టడాలకు పూర్వవైభవం తీసుకొస్తున్న సీఎం జగనన్నకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి గ్రామస్తులు కృతజ్ఞలు తెలిపారు. అలాగే ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ స్థానిక నాయకులు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్‌ను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అర్కాలజిస్టు అడ్మినిస్ట్రేషన్ అధికారి అపర్ణ, డీఈ శ్రీనివాసులు, ఏడీ పవన్ కుమార్, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్ కుమార్, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ విజయులురెడ్డి, హెచ్ఎం కోటేశ్వర్రావు, శేషాద్రి, పలువురు పాల్గొన్నారు.

# తడి, పొడిచెత్త సేకరణకు 9 ఎలక్ట్రిక్ ఆటోలు

**ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్:** మున్సిపల్ పరిధిలో తడిచెత్త, పొడిచెత్త సేకరణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నగరి మున్సిపల్ కార్యాలయానికి 9 ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరయ్యాయి. నూతన ఆటోలను మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం జెండా ఊపి విధులకు పంపించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చెత్తసేకరణకు నూతనంగా వచ్చిన ఎలక్ట్రిక్ ఆటోలు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలు తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి వాహనాల్లో వేయాలన్నారు. ఎలక్ట్రికల్ ఆటోలు కావడంతో రూ.99 వేలతో ఈటీపీ ప్రాంగణంలో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నామన్నారు. చెత్తసేకరణలో సిబ్బంది చురుకుగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## సమన్వయంతో ఎన్నికలు నిర్వహించాలి

**జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య**

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ



**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** రాబోయే సార్వత్రిక ఎన్నికలను అధికారులు అందరు సమన్వయం చేసుకొని జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక డీఆర్డీఏ సమావేశం హాల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్యతో కలసి 2024 సార్వత్రిక ఎన్నికలలో నిర్వహించవలసిన బాధ్యతలపై నోడల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను అధికారులు అందరూ సమన్వయం చేసుకొని జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహిదామన్నారు. ఎన్నికల నిర్వహణకు 16 టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకపై ప్రతి రోజు మధ్యాహ్నం నుంచి నోడల్ ఆఫీసర్లతో పాటు వారికి కేటాయించిన సహాయక సిబ్బందితో కలసి ఎలక్షన్స్ పనులు చేయవలసి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఏ రోజు పని ఆ రోజే చేయవలసి ఉంటుందని, అదేవిదంగా రిపోర్ట్ కూడా ఆ రోజే పంపవలసి ఉంటుందని అయితే రిపోర్ట్‌లు ఆర్ఓ నుండి మాత్రమే పంపించాలని తెలిపారు. ఎక్కువ ఫిర్యాదులు ఎంసిసికి వస్తాయని వాటిని బాధ్యతగా తీసుకొని పనిచేయాలన్నారు. అందరికీ శిక్షణా ఇవ్వడం జరుగుతుందని, ఎలక్షన్స్‌లో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా క్రమశిక్షణతో పని చేయాలన్నారు. జిల్లాకు సంబంధించి 7 నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గంకు సంబంధించి రిపోర్టులు పంపవలసి ఉంటుందన్నారు. మీ కిందిస్థాయి సిబ్బంది నుండి రిపోర్టులు తెప్పించుకుని పైస్థాయి అధికారులకు పంపించాలన్నారు. మీరు అందరు రాబోయే ఎలక్షన్స్‌లో సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎన్నికలను విజయవంతంగా నిర్వహిదామని తెలిపారు. మీకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎలక్షన్స్‌లో పనిచేయడం అదృష్టమన్నారు. ఈసమావేశంలో 16 నోడల్ ఆఫీసర్స్ టీమ్స్, వారికి కేటాయించిన సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి గొప్పది


**పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం**

**ప్రజాశక్తి - వికోట:** ఒకే మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా 40 సంవత్సరాలు సుదీర్ఘకాలం పనిచేయడం అభినందనీయమని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. వికోటలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన బైరుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పి.జైపాల్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇదే మండలంలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా తన సేవలను అందించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన మహోన్నత వ్యక్తి జైపాల్ అని కొనియాడారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయులు, పురప్రముఖులు జైపాల్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు చంద్రశేఖర్, మురుగేష్, ఉపాధ్యాయులు ఇలియాస్, జయప్ప, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.


వికోటలో..

**బంగారుపాళ్యం:** ఉపాధ్యాయ వృత్తి గొప్పదని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా అన్నారు. గురువారం మండలంలోని గుండ్ల కట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శివరాం పదవీవిరమణ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేబీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా దేశానికి ఎంతో ఉత్తమపౌరులను అందించిన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, ఉపాధ్యాయులు లేకపోతే దేశ అభివృద్ధి జరగదన్నారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దత్తురెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, డిఎస్ఈవో చంద్రశేఖర్, ఎంఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**చిత్తూరు డెస్క్:** యాదమరి మండలం కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ లో స్కూల్ అసిస్టెంట్, సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న సి.విజయ కుమార్‌కి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎపి. లలిత 40సంత్సరాలుగా ఉపాధ్యాయవృత్తిలో పనిచేసి ఆదర్శ టీచర్‌గా, అందరికి మార్గదర్శిగా ఉన్నారని ఆమె కొనియాడారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు కనకాచారి, మదన్ మోహన్ మాట్లాడుతూ విజయ్ కుమార్ విద్యార్థులకు నూతన పద్దతులతో భోధనచేసి మండలంలోనే ప్రత్యేక గుర్తింపుతోపాటు అందరు మన్ననలు పొందిన ఉత్తమటీచర్‌గా పేరుపొందారని కొనియాడారు. పేరు పొందినారు. సర్పంచ్ రాధ మురళి, పాఠశాల కమిటీ వైస్ చైర్పర్సన్ చిట్టెమ్మ, ఉపాధ్యాయులు భాస్కర రెడ్డి, మురళీధరన్, నరసింహారెడ్డి, మధుసూదన్, దామోదర్ రెడ్డిపాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో..

## మెగా జాబ్‌మేళాలో 397 మందికి ఉద్యోగాలు




**ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా కమీషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నగరి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 653మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ ఉద్యోగాలకు 397 మంది ఎంపికయ్యారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ జాబ్‌మేళాకు నగరి, పుత్తూరు, కార్వేటినగరం, సత్యవేడు, శ్రీకాళహస్తిలోని రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అంటూ ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 433 మంది విద్యార్థులు ఇతరులు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పేటియం, డిక్సన్, అపోలో ఫార్మసీ, టెక్ మహేంద్ర, టాటా ఎలక్ట్రానిక్స్, అమెజాన్ వెర్సస్ తదితర 20 కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో 6 కళాశాలల నుండి 355 మంది, ఇతరుల నుండి 42మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్ శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన ఉద్యోగాల్లో నైపుణ్యాలను ప్రదర్శించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ జాబ్‌మేళాలో పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి కళాశాల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు రెడ్డి, సురేష్‌బాబు, శ్రీలత, ఆంగ్ల అధ్యాపకులు, నోడల్ రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ పంకజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 'నా కుమార్తెను ఆదరించండి'

**డిప్యూటీ సీఎం నారాయణస్వామి**


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** ఉన్నత చదువులు అభ్యసించి రాజకీయంపై ఆసక్తి పెంచుకున్న తన కుమార్తె కృపాలక్ష్మిని ఆశీర్వదించి ఆదరించాలని, ఆమె విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం కార్వేటినగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ కుమార్తెను ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించాలని అభ్యర్థించానని, నా అభ్యర్థన మేరకు తన కుమార్తె కృపాలక్ష్మికి టికెట్ ఇచ్చిన సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటామని అన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తమ గెలుపుకు ఎలా కృషి చేశారో అదే విధంగా పనిచేసి తమ కుమార్తె కృపాలక్ష్మిని ఆశీర్వదించి విజయాన్ని అందించి జగనన్నకు కానుకగా అందజేయాలని పిలుపునిచ్చారు. కృపాలక్ష్మికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడానికి కృషిచేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి మంత్రి నారాయణస్వామి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఉపసర్పంచ్ శేషాద్రి, జిల్లా రైతువిభాగం కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి, ధనశేఖరవర్మ ఉన్నారు.

## అధికారులు నియమావళి తప్పక పాటించాలి

**నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివ**

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** ఎన్నికల విధుల్లో పాల్గొనే కిందిస్థాయి సిబ్బంది నుంచి వివిధస్థాయి అధికారుల వరకు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సిందేనని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. గంగాధర నెల్లూరు ఎంపీడీవో ఆఫీసులో గురువారం నియోజకవర్గ పివోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులు, తహశీల్దారులకు ఎలక్షన్ డీటీ విజయకృష్ణ, ఈవీఎం యంత్రాలు పనివిధానం వాటి వల్ల ఎటువంటి సమస్యలు ఎదురవుతాయి, తద్వారా యంత్రాల్లో ఏర్పడే సమస్యలను పరిష్కరించుకోవాల్సిన విధానాలపై వివరించారు. అదేవిధంగా ఎన్నికల విధులు బాధ్యతలు గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహశీల్దారులు సుబ్బలక్ష్మమ్మ, సుభద్రమ్మ, పుష్పకుమారి, ఆల్ ఫ్రెండ్, ఎలక్షన్ డిటీ విజయ కృష్ణ ఆనందమోహన్ పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

**రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులు**

**ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్:** రూరల్ మండలం వేలావడి ఎస్టీ కాలనీకి రూ.35లక్షల నిధులతో నిర్మించే రోడ్డుకు, కావేటిపురం దళితవాడకు రూ.10లక్షల నిధులతో నిర్మించే రోడ్డుకు, బీరకుప్పంలో 15 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంటు కాలువలకు మంత్రి ఆర్కేరోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి గురువారం భూమి పూజ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని స్థానిక నాయకులను ఆదేశించారు. ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, జ్యోతి, కోఆప్షన్ సభ్యుడు దస్తగిర్, నాయకులు వేలాయుధం, ఛాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## మాల వర్గాల పట్ల ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిద్దాం'




**ప్రజాశక్తి- పెద్దపంజాణి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల సామాజిక వర్గాల పట్ల అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను వ్యతిరేకించి నిరసన వ్యక్తం చేద్దామని మాల మహానాడు రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం విజయవాడలో ఉండవల్లి రాజగృహ సమావేశం మందిరంలో జరిగిన మాల మహానాడు జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో దళితులపై జరుగుతున్న దాడులపై తీవ్రంగా స్పందించారు. అదేవిధంగా భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలసామాజిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించేందుకు ప్రజాప్రతినిధులను సన్నద్ధం చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు సాదె డేవిడ్ రాజు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శన్, జాతీయ కార్యదర్శి తోటమల్లి మల్లేష్, రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి యన్ఆర్.అశోక్, రాయలసీమ కార్యదర్శి యమలా చంద్రయ్య, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కందస్వామి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివయ్య పాల్గొన్నారు.

## వైసిపి ని ఆదరించండి: ఎమ్మెల్యే సునీల్ కుమార్



**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** వైఎస్సార్‌సీపీని ఆదరించాలని పూతలపట్టు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి సునీల్ కుమార్ కోరారు. సెట్టేరి గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ప్రచారం చేస్తూ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి, రాబోవు ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని, ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మెరుగుగా పరిపాలన కొనసాగించేందుకు జగన్మోహన్ రెడ్డి కంకణ బద్ధులై ఉన్నారని రాబోవు ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి విజయానికి కృషి చేయాలన్నారు. ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, మండల కో ఆప్షన్ సభ్యులు ఫిరోజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## 'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - సదుం:** మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబాయి పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ మీడియంలో చదువుటకు విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలని సదుం బిసి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తులు ఎంజెపిఏపిబిసి డబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపి సిఎఫ్ఎస్ఎస్. ఇన్ వెబ్‌సైట్ ద్వారా మార్చి 1 నుంచి 31వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## అమరావతి మృతికి నివాళి

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** మండలంలోని కురివి కుప్పం హరిజనవాడకు చెందిన కే.వేణు భార్య అమరావతి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో వేలూరు సిఎంసి హాస్పిటల్లో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు గురువారం ఉదయం కురివికుప్పంలో అమరావతి (24) మృతిదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వి.ఎం.థామస్ తమ్ముడు వి.నిధి హాజరయ్యారు. మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ్‌రెడ్డి, మోహన్ మురళి, నాధమునిరెడ్డి, రాజారెడ్డి, వరప్రసాద్, శంకర్ రాజేంద్ర చెల్లయ్య ఉన్నారు.

## ఘనంగా గంగమ్మ జాతర

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి :** మండలంలోని గంగినాయనీపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తఇండ్లు గ్రామంలో ఆనవాయితీగా వస్తున్న సల్లాపురి గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు గంగమ్మకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వైసిపి రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, వారి కుటుంబం, అలాగే టిడిపి నాయకులు కిషోర్ గౌడ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**టిడిపి గెలుపుకు**

## మహిళల ఓట్లు మహాశక్తి గా మారాలి

**ప్రజాశక్తి- శాంతిపురం:** శాంతిపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం క్లస్టర్ వన్ మహిళా శక్తి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా అధ్యక్షురాలు హరణ మాట్లాడుతూ చంద్రన్న ప్రవేశ పెట్టనున్న సూపర్ సిక్స్, మహాశక్తి గురించి ప్రజలకు వివరించి ప్రతి మహిళ సైకిల్ గుర్తుకు ఓటు వేసే విధంగా చూడాలన్నారు. మండల మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ మాట్లాడుతూ టిడిపిని గెలిపించు కోవడానికి ప్రతిజ్ఞ భూనాలన్నారు. కుప్పం నియోజకవర్గం ఇంచార్జ్ పిఎస్.మణిరత్నం, కుప్పం క్లస్టర్ ప్రతాప్, ప్రెసిడెంట్ విశ్వనాథ్ నాయుడు, నాగరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, రూప, మాజీ ఎంపీపీ పుష్ప, మాజీ జెడ్పిటిసి శకుంతల, హెమా రాణి, చరిత, వేదవతి పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్**

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** భారత రాజ్యాంగంలో పిల్లలకు కల్పించిన చట్టాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవా అధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం చిత్తూరు మండల విద్యాశాఖ అధికారి సెల్వరాజ్, ప్రిన్సిపాల్ సాగరికలతో కలిసి పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో 7వ తరగతి మరియు 8 వ తరగతి చదివే విద్యార్థులకు చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పిల్లలకు కల్పించిన చట్టాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌కు సంబంధించి ఉపాధ్యాయులు విద్యార్థులు వివరించాలన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుండి మంచి అలవాట్లు అలవాటు చేసుకోవాలని అప్పుడే వారు ఉన్నతస్థాయికి వెళ్ళడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థి దశ నుండి సమాజంలో జరుగుతున్న పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచికి దగ్గరగాను చెడుకు దూరంగా విద్యార్థులు ఉండాలని సూచించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విజేతలకు మెమెంటోస్, మెరిట్ సర్టిఫికెట్స్‌ను జడ్జి విద్యార్థులకు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్

# మరిన్ని అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

**ఇలాంటి అభివృద్ధి పనులు ఇదివరకెన్నడూ జరగలేదు**

**సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం**



**ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్:** మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నందుకుగాను మంత్రి ఆర్కే రోజాకు మున్సిపల్ కౌన్సిల్ ధన్యవాదాలు తెలిపింది. గురువారం నగరి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ సాధారణ ఈసమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆదేశానుసారం మున్సిపల్ అధికారులు సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలున్నా, వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉన్నా తెలపాలంటూ మున్సిపల్ చైర్మన్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తమతమ వార్డుల్లో ఇదివరలో జరిగిన అభివృద్ధిని ప్రస్తుతం చేపట్టవలసిన పనులను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో పార్కు నిర్మించడం జరిగిందని, రూ. 1.75 కోట్ల నిధులతో శ్మశానవాటికను ఆధునీకరిస్తున్నారన్నారు. కీళపట్టు మార్గంలో వంతెనను నిర్మించనున్నారన్నారు. రెండు అర్బన్ హెల్త్‌సెంటర్లు నిర్మించుకోగలిగామని అవి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఏరియా ఆస్పత్రిని 5 కోట్ల నిధులతో ఆధునీకరించి ఆక్సిజన్ ప్లాంటులు ఏర్పాటుచేసుకున్నామని అతిత్వరలో డయాలసిస్ వార్డు ప్రారంభం కానుందన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులు ఇదివరకు ఎన్నడూ జరగలేదన్నారు. ఇందుకుగాను మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. దీనిపై కౌన్సిలర్లు ఏకీభవిస్తూ తమ కరతాధ్వనులతో తమ ధన్యవాదాలను తెలిపారు. ప్రజావసరాలకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేస్తూ వెళుతున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలోకి 100 మంది

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్ సమక్షంలో గురువారం స్థానిక 36వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ గుణశేఖర్ నేతృత్వంలో వంద మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరే ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. టిడిపి, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరుస్తూ చిత్తూరు నియోజకవర్గంలో అనేక మంది తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు గ్యారెంటీ కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు.



# వీధి కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి



**ప్రజాశక్తి- సోమల:** సోమల మండలం నంజంపేట గ్రామానికి చెందిన గొల్లపల్లిలో రెడ్డప్ప యాదవ్‌కు చెందిన గొర్రెల మందపై వీధికుక్కలు బుధవారం అర్ధరాత్రి దాడిచేసి 10 గొర్రెలను చంపివేయగా మరో పది గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. నంజంపేట గ్రామీణ బ్యాంకు ఎదురు వీధికి చెందిన రెడ్డప్ప యాదవ్ గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటికి సమీపంలోనే గొర్రెల దొడ్డి ఏర్పాటు చేసుకొని ప్రతిరోజు ఉదయం మేతకు తీసుకువెళ్లి సాయంత్రం తీసుకువచ్చి దొడ్డిలో వదిలేవాడు. బుధవారం సాయంత్రం కూడా యథాప్రకారం గొర్రెల దొడ్డిలో 30 గొర్రెలను వదిలి చుట్టూరు ఉన్న కంచెను భద్రం చేసి ఇంటికి వెళ్లి పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో దాదాపు 30కి పైగా వీధి కుక్కలు గొర్రెల దొడ్డిలోకి ప్రవేశించి ఇష్టానుసారం గొర్రెలను కరచి కొన్నింటిని చంపివేసి, మరి కొన్నింటిని తీవ్రంగా గాయపరిచాయి. గొర్రెల అలికిడి విన్న రెడ్డప్ప యాదవ్ బయటకు వచ్చి కుక్కలను తరిమేందుకు ప్రయత్నించగా అవి అతని మీద కూడా దాడి చేసేందుకు రావడంతో భయపడి ఇంటిలోకి వెళ్లిపోయాడు. ఉదయం వెళ్లి చూడగా అప్పటికే 10 గొర్రెలు మృతిచెందగా మిగిలిన 20 గొర్రెలలో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడి రక్తం కార్చుకుంటూ మృత్యువుతో పోరాడుతున్నాయి. వీధి కుక్కల దాడిలో మృతి చెందిన, గాయపడిన గొర్రెల విలువ దాదాపు ఒకటిన్నర లక్షల రూపాయల విలువ చేస్తుందని యజమాని రెడ్డప్ప తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ జిన్నా పశుసంవర్ధక శాఖవారికి సమాచారం ఇవ్వగా గాయపడ్డ పశువులకు వైద్యం చేసి వెళ్లినట్టు తెలిపారు. రెడ్డప్ప యాదవ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

మండలంలోని అన్ని గ్రామాలలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల వీధికుక్కల దాడిలో ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామంలో కూడా పలు గొర్రెలు మృతి చెందాయి. కోళ్ళు, మేక పిల్లలు కూడా వీధి కుక్కల దాడిలో బలవుతున్నాయి. ఇటు కుక్కల బెడదతో పాటు కోతులు కూడా అధికంగా ఉంటూ ఏమరపాటుగా ఉంటే ఇండ్లలోని వస్తువులను ఎత్తుకెళ్లిపోవడం, పిల్లలు మహిళలు ఏదైనా వస్తువులు చేతిలో తీసుకు వెళుతుంటే కోతులు వచ్చి వాటిని బలవంతంగా లాక్కు వెళ్లడం ఇవ్వకపోతే దాడి చేయడం చేస్తున్నాయి. గతంలో మండల సర్వసభ్య సమావేశంలోనూ కుక్కలు, కోతులు బెడదపై ఎన్నోసార్లు సభ్యులు సమస్యను లేవదీసినా అధికారులు పరిష్కారమార్గం చూపకపోవడం గమనార్హం.